క్లుప్తంగా

ఏనుగు మల్లమ్మకు ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండకు వెళ్లే మార్గంలో వెలసిన ఏనుగుమల్లమ్మ ఆలయంలో విశ్వావసునామ సంవత్సర ఉగాది సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి శేఖర్, విజయకుమారి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మల్లయ్యకొండకు వెళ్లే భక్తులు తొలి పూజ ఏనుగులమల్లమ్మ ఆలయంలో నిర్వహించడం అనవాయితీ. దీంతో మహిళా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని పూజలతో మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులతో పోటెత్తిన ఆలయాలు


విశేషాలంకరణలో చెన్నకేశవస్వామి

బి.కొత్తకోట: నూతన సంవత్సరాది విశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం బి.కొత్తకోటలో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక చెన్నకేశవ, ఆంజనేయ, చౌళ్వేర, వెంకటేశ్వర స్వామి, గంగమ్మ ఆలయాలకు భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించగా భక్తులకు తీర్థప్రసాదాలను, ఉగాది పచ్చడి అందించారు. ఆలయాల్లో మూలవిగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయాల్లో అర్చకులు హాజరైన ప్రజలతో పంచాగ పఠనం చేశారు. ఈ ఏడాది ఎలా ఉండబోతుంది, పంటలు, వర్షాలు, వివిధ అంశాలపై వివరించారు.

జమాతే హింద్ ఉగాది శుభకాంక్షలు


ఉగాది గ్రీటింగ్ కార్డును అందిస్తున్న జమాతే-ఇస్లామీ-హింద్ సంస్థ సభ్యులు

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో జమాతే-ఇస్లామీ-హింద్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖులకు ఉగాది పండుగ శుభకాంక్షలు తెలియజేస్తూ కార్డులు పంచిపెట్టారు. ఆదివారం ఆసంస్థ అన్నమయ్య జిల్లా శాఖ అధ్యక్షులు ఆజమ్ఆలీఖాన్ సభ్యులతో కలసి విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ శుభకాంక్షల గ్రీటింగ్ కార్డులను పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులకు తొలి పండుగ అయిన ఉగాది అందరికీ మంచి తేవాలని, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌనఖ్‌బాషా, సభ్యులు హషీమ్‌బాషా, అబ్దుల్ మజీద్ పాల్గొన్నారు.

సిద్దేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం


ప్రత్యేక అలంకరణలో శ్రీచౌడేశ్వరిదేవి

కలకడ : మండలంలోని శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఆదివారం ఉగాది పర్వదినం పురస్కరించుకుని త్రికూటమి సారధిస్వామి 2025లో అన్ని రాశులవారికి వారి రాశిని అనుసరించి జరిగే, శుభ-అశుభ కార్యాలను తెలియజేశారు. పరస్పరం ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే మండలంలోని కలకడ, కోన, గుడిబండ, కదిరాయచెర్వు, కెజబాటవారిపల్లె గ్రామాలలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవికి, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న సమాజ సేవకులు

పెద్దతిప్పసముద్రం: ఉగాది పర్వదినాన పలువురు సమాజ సేవకులు అన్నదానం నిర్వహించి 50 మంది నిరాశ్రయ వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేశారు. స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య, బి.కొత్తకోట, బెంగళూరు, మదనపల్లి, తెట్టు గ్రామాలకు చెందిన ఆకుల మల్లికార్జున, శ్రీనివాస్, సురభీ క్రిష్ణ శర్మ కుటుంబీకులు ఆదివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ఊరూరా ఉగాది వేడుకలు


పంచాంగశ్రవణం వినిపిస్తున్న అర్చకులు కార్తీక్‌దీక్షిత్


వెంకటేశ్వరస్వామి దర్శించుకుంటున్న నిస్సార్‌అహ్మద్

- ఆలయాల్లో పంచాంగ శ్రవణం
- భక్తుల ప్రత్యేక పూజలు

మదనపల్లె సిటీ: శ్రీవిశ్వావసునామ ఉగాది సంవత్సరాన్ని పురస్కరించుకుని మదనపల్లె పట్టణంతో పాటు ఊరూరా ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయాల్లో పంచాంగశ్రవణం నిర్వహించారు. స్థానిక కోటవీధిలోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో అర్చకులు సాయిచక్రవర్తి పంచాంగశ్రవణం భక్తులకు వినిపించారు. ఏపీ రాశుల వారికి నూతన ఏడాది రాశి ఫలితాలను తెలియజేశారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీక్‌దీక్షిత్ పంచాంగశ్రవణం నిర్వహించారు.

పితృదేవతలకు పూజలు

ఉగాది పండుగ పురస్కరించుకుని ఇళ్లలో పిండివంటలు చేశారు. ఉగాది పచ్చడి చేసి అందరికి పంచిపెట్టారు. పితృదేవతలకు నూతన బట్టలు పెట్టి పూజలు చేశారు. హిందూ శ్మశానవాటికల వద్దకు వెళ్లి పూర్వీకుల ఆత్మశాంతి కోసం పూజలు చేశారు.

రామాలయంలో ఉగాది ఉత్సవాలు

స్థానిక సొసైటీ కాలనీలోని రామాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని వితరణ చేశారు. ఉగాది పచ్చడి స్వీకరించడం ద్వారా మనందరికీ ఆరోగ్యం, జీవితంలో అనేక ఒడిదుడుకలు, కష్టసుఖాలను అనుభవిస్తూ ఉంటామని ఏపీయుఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి తెలిపారు. భక్తులకు హనుమాన్‌చాలీసా, భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిశేఖర్, హరినాథ్, అపస్‌నాయకులు భాస్కర్, గిరిష్ తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పచ్చడి అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు

వెంకన్న సేవలో నిస్సార్‌అహ్మద్

ఉగాది పండుగను పురస్కరించుకుని స్థానిక దేవళం వీధిలోని శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో స్వామిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ దర్శించుకున్నారు. వేదపండితులు బాలాజీ, గోవర్ధన్‌భట్టార్‌లు స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందజేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని కోరుకున్నట్లు నిస్సార్‌అహ్మద్ తెలిపారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరీముల్లా, మల్లికార్జున రెడ్డి, బీరంగి రేవతి, నూర్, మల్లిక, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలంలోని పలుగ్రామాల్లో ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకొన్నారు. ఆదివారం విశ్వావసు సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని తరిగొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వేకువజామునే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, పంచాంగ శ్రవణం కావించారు. అనంతరం రంగురంగుల పుష్పాలతో అలంకరించిన స్వామివారి వాహనంపై స్వామివార్లను కొలువుదీర్చి మేళతాళాలతో గ్రామపురవీధులలో తిరుచ్చి (గ్రామోత్సవం) వైభవంగా నిర్వహించారు. మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో పండుగ రోజును పురస్కరించుకొని పంచాంగ శ్రవణం నిర్వహించారు. పలువురు ఆలయ అర్చకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి రుద్రాభిషేకం, సహస్ర నామార్చనతో విశేష పూజలు చేశారు. గుర్రంకొండలో గ్రామదేవత శ్రీ గంగమ్మతల్లిని వైభవంగా గ్రామపురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు.


తరిగొండ ఆలయంలో ఉగాది పంచాంగ శ్రవణం కావిస్తున్న అర్చకులు


లక్ష్మీ నరసింహస్వామికి తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రంజాన్‌కు ఈద్గాలు ముస్తాబు


మదనపల్లె : ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా

మదనపల్లె సిటీ: రంజాన్ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని ఈద్గా మైదానాలు ముస్తాబు చేశారు. ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డులోని ఈద్గా మైదానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల తీవ్రత వల్ల షామియానాలను ఏర్పాటు చేశారు. మసీదులు,ఈద్గాల వద్ద పరిశుభ్రం చేశారు. తాగునీరుతో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. బెంగళూరు రోడ్డులోని ఈద్గాలో ఉదయం 8 గంటలకు, జామియా మసీదులో ఉదయం 8.15 గంటలకు, మోతీనగర్ మసీదులో ఉదయం 8.30 గంటలకు, స్థానిక నీరుగట్టువారిపల్లెలోని టిప్పుసుల్తాన్ మసీదులో ఉదయం 7 గంటలకు, డ్రైవర్స్ కాలనీలో ఉదయం 9.30 గంటలకు ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఖాజీ జలాలుద్దీన్‌సాహెబ్ తెలిపారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు పూర్తి

పీలేరు రూరల్ : రంజాన్ పండుగకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ముతవల్లి అల్లావుద్దీన్ అన్నారు. ఆదివారం స్థానిక మదనపల్లెరోడ్డులోని ఈద్గా వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పట్టణంలోని ముస్లిం సోదరులు క్రమశిక్షణతో ప్రశాంతంగా ఈద్గా వద్దకు చేరుకుని ప్రార్థనలు నిర్వహించుకోవాలని సూచించారు. సోమవారం ఉదయం ఈద్‌ఉల్ ఫితర్‌లో భాగంగా ఉదయం 8.30 గంటలకు ప్రార్థనలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు లడ్డూజాఫర్, ఇబ్రహీం, రహంతుల్లా, షరీఫ్, సైపుల్లాబేగ్ పాల్గొన్నారు.


పీలేరులో ఈద్గాను సిద్ధం చేస్తున్న నాయకులు

చెత్తకుప్పలా ఉపాధిహామీ రికార్డులు

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలోని ఉపాధిహామీ కార్యాలయంలో ఉపాధిహామీ పథకంకు సంబంధించిన రికార్డులు చెత్తకుప్పలా మూలన పడేశారు. గతంలో మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబందించిన ఎం బుక్కులు, మస్టర్లు, రిజిష్టర్లు కుప్పలు కుప్పలుగా తీసుకొచ్చి కార్యాలయం మెట్ల కిందే పడేశారు. పలు మార్లు నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగసభకు సంబంధించిర రికార్డులు కూడా చెత్తకుప్పల్లో పడేయడం గమనార్హం. ఎన్నో సంవత్సరాలకు సంబంధించిన రికార్డులు ఇలా చెత్తకుప్పలు మాదిరిగా పడేయడం చర్చనీయాంశంగా మారింది. ఈవిషయమై ఏపీఓ జయరామిరెడ్డిని వివరణ కోరగా గతంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులను అక్కడ ఉంచామన్నారు. వాటిని ఏం చేయాలో అర్థం కావడం లేదని పేర్కొన్నారు.


కార్యాలయం మెట్ల కింద కుప్పలుగా పడేసిన ఉపాధిహామీ రికార్డులు

భక్తులతో ఆలయాలు కిటకిట

కలికిరి: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉగాదిని పురస్కరించుకుని కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఆలయంలో నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వసంత నవ రాత్రి ఉత్సవాలు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సోమేశ్వరాలయంలో అర్చకులు రామచంద్రశాస్త్రి, శివకుమార్‌శాస్త్రిలు ఉగాది పంచాంగం పఠనం చేశారు. సాయిబాబా, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ భక్తులు పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఇంట్లో పూజలు, పెద్దలకు బట్టలు పెట్టి పూజలు నిర్వహించుకున్నారు. ఉగాది షడ్రుచుల పచ్చడి పంచిపెట్టారు.

సామాజిక స్పృహతో రాసే కవిత్వం సజీవం

మదనపల్లె సిటీ: సామాజిక స్పృహతో కవిత్వం రాస్తే సమాజంలో ఎప్పుడూ బతికి ఉంటుందని సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షుడు మునిగోపాల కృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక బొంతవారి కళ్యాణ మండపంలో మదనపల్లె రచయితల సంఘం (మరసం) 27వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉగాది రోజు కవికోయిలకు మరసం వేదిక అయ్యింది. సాహితీలోకంలో మరసం క్రమం తప్పకుండా ఉగాది కార్యక్రమాలు, సాహితీ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రముఖ కవులు తమ కవితలు వినిపించారు. రుషివ్యాలీ పాఠశాల విద్యార్థులు మృదంగ లయ విన్యాసం ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యక్షులు ప్రసాద్, కోశాధికారి రామోహన్‌నాయుడు, ప్రముఖ కవులు పాల్గొన్నారు.


నాటకంలోని నటులను అభినందిస్తున్న మరసం సభ్యులు

ఆకట్టుకున్న స్వామి నాటకం

స్వామి నాటకం ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో నటులు లింగాల యుగంధరాచారి, నాగభూషణరావు, రాఘవేంద్రబాబు నటన మైమరించారు. రచన,దర్శకత్వం లింగాల యుగంధారాచారి నిర్వహించారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి ఉగాది శుభాకాంక్షలు


ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిస్సార్‌అహ్మద్, నాయకులు


ఎంపీ మిథున్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు

మదనపల్లె సిటీ: రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని విశ్వావసు ఉగాది సందర్భంగా ఆదివారం తిరుపతిలో ఆయన నివాసంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యలంఓ ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.ఎంపి మిథున్‌రెడ్డికి కుటుంబ సభ్యుల తైలవర్ణ చిత్రపటాన్ని ఎన్ఆర్ఐ దండు శేఖర్‌రెడ్డి అందజేశారు. ఏడాది అంతా మంచి జరగాలని,అనుకున్న కోరికలు నెరవేరాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని, భవిష్యత్తులో మనకు మంచి రోజులు రాబోతున్నాయని నాయకులకు భరోసా కల్పించారు. ఎంపీని కలిసినవారిలోల వైఎస్సార్‌సీపీ నాయకులు తట్టి శ్రీనివాసులురెడ్డి, గార్ల చంద్రమౌళి, ఇర్ఫాన్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

ఎంపీని కలిసిన మాజీ ఎమ్మెల్యే

కలికిరి(వాల్మీకిపురం): పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదివారం తిరుపతిలోని ఎంపీ మిథున్ రెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతం, కష్ట నష్టాలలో పార్టీ నేతలు, కార్యకర్తలకు అండగా ఉండటం తదితరాలపై చర్చించినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, వైఎస్సార్‌సీపీ యువనేత పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు


అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నీరుగట్టువారి పల్లెలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉత్సవాలను పురస్కరించుకున ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వివిధ రకాల పూలతో అలంకరించారు. ఆలయం వద్ద భక్తులతో కిటకిటలాడింది. నీరుగట్టువారిపల్లె, కదిరిరోడ్డు, బైపాస్‌రోడ్డు, గొల్లపల్లి ప్రాంతాలు రద్దీ ఏర్పడింది. పోలీసులు బారీ కేడ్లు ఏర్పాట్లు చేసి రద్దీను అదుపు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. అమ్మవారిని తిరువర్రూర్ కమలాంబిక అలంకరణ చేశారు. అలాగే సుబ్రమణ్యస్వామి, వినాయకుని విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు అమ్మవారికి దీలు,బోనాలు సమర్పించారు. ఆలయం ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించారు. రాత్రి తొగటవీరక్షత్రియులు జ్యోతులతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని సింహవాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పు చంద్రశేఖర్, కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి రత్నమయ్య, తెలుగుయువత శ్రీరాంచినబాబు,"మోడం సిద్ధప్ప, బండి నాగరాజ, ఉప్పు రామచంద్ర, నీలకంఠ,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


తిరువర్రూర్ కమలాంబిక అలంకరణలో అమ్మవారు

నేడు సింగన్నగారిపల్లె జాతర

కురబలకోట: మండలంలోని సింగన్నగారిపల్లెలో వెలసిన చిన్నతోటమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ ఉప్పతి నాగరత్న, మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఈశ్వర్‌తో పాటు గ్రామస్థులు తెలిపారు. సోమవారం రాత్రి చాందినీ బండ్లు మెరువన, మంగళవారం ఉట్ల ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేసినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

కళాకారుడికి ఉగాది పురస్కారం

పీలేరురూరల్ : పట్టణానికి చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటక, వెండితెర, బుల్లితెర నటుడు ఖాదర్‌బాషా ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం రాజంపేటలోని జీఎంసీ కళామందిర్‌లో రాయలసీమ కళాపీఠం ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని ఎంపిక చేసి పురస్కారాలు ప్రదానం చేశారు. పీలేరుకు చెందిన ఖాదర్‌బాషా కళారంగం విభాగంలో ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా రాయలసీమ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు పి. లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు షామీర్‌బాషా చేతుల మీదుగా పురస్కారం ప్రదానం చేశారు.


సత్కారం పొందుతున్న ఖాదర్‌బాషా

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సేవలు విస్తరింపచేస్తాం

పీలేరు రూరల్ : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సేవలు విస్తరింపచేస్తామని ఆర్ఎస్ఎస్ ప్రాంత శారీరక ప్రముఖ్ చంద్రశేఖర్, పీలేరు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ గోపికిషోర్ అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం ఆర్ఎస్ఎస్ గణవేష్‌దారి స్వయంసేవకులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అని పేర్కొన్నారు. గత 99 సంవత్సరాలుగా వ్యక్తి నిర్మాణ ప్రక్రియద్వారా స్వదేశీ స్వాభిమాన భావాలను పెంపొందిస్తూ వైభవోపేత సమాజాన్ని నిర్మించడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు శశిధర్‌రెడ్డి, మల్లికార్జునగుప్తా, బాలాజీ, మధుసూదన తదితరులు పాల్గొన్నారు.


పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు